క్లుప్తంగా

హేతుబద్ధీకరణ నుంచి మినహాయించండి



జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుకు వినతిపత్రం అందజేస్తున్న వేణుమాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలని ఉమ్మడి జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం ఉదయం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావును కలిసి వినతిపత్రం అందించినట్టు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో కొన్నిచొట్ల తమను కూడా గ్రామస్థాయిలోని రైతు సేవ కేంద్రంలో వేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో తమను సహాయకులుగా నియమించాలని కోరారు. జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం వినతిపత్రాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు డీఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ కోశాధికారి ఎం.నాగేశ్వరావు సభ్యులు పీటర్, శివ, గౌరీ ప్రసన్న పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాల బహూకరణ



ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు సీసీ కెమెరాలు అందజేస్తున్న ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు

కడియం: మండలంలో వివిధ ప్రాంతాలలో ప్రజల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు నిమిత్తం కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ పల్లా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో రూ.లక్ష విలువైన సీసీ కెమెరాలను బహూకరించారు. శనివారం ఈ మేరకు కడియం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ వెంకటేశ్వరరావుకు ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను అందజేశారు. ప్రజలకు ఉపయోగపడేలా కెమెరాలు అందించిన కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ పల్లా సుబ్రహ్మణ్యం, సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డీబ్లాకులో నూతనంగా నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని శనివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆవిష్కరించారు. రాష్ట్ర టీడీపీ వైద్యవిభాగ ప్రధాన కార్యదర్శి డా.గోరంట రవిరామ్‌కిరణ్, రాజమండ్రి ఏఎంసీ చైర్మన్ మార్నివాసుదేవ్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర టీడీపీ మహిళా కార్యదర్శి మజ్జిపద్మ, హుకుంపేట కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కోరుకొండ: అప్పు విషయమై భార్యా భర్తల మధ్య వాగ్వివాదంతో అలిగిన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన కోరుకొండ మండలం గాడాలలో శనివారం జరిగింది. కోరుకొండ పోలీసుస్టేషన్ ఎస్సై కూన నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గాడాలకు చెందిన పాపారావు అప్పులు ఎక్కువగా చేస్తున్నావని భార్య దేవిపై కోపగించుకున్నాడు. అప్పుడు ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో అలిగిన భార్య ఇంటినుంచి వెళ్లిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

సినిమాలు



శ్యామల	: జింఖానా
సూర్యమినీ	: రైడ్-2
సూర్యప్యాలెస్	: థండర్‌బోల్ట్స్
స్వామి	: హిట్-3
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ	: హిట్-3
రాజా	: హిట్-3
ఊర్వశి	: హిట్-3
మేనక	: అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
రంభ	: గుడ్‌బ్యాడ్అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	: సారంగపాణిజాతకం
అప్సర	: రెట్రో
అశోక	: రెట్రో
నామవరం	
వివిఎస్‌మహల్	: హిట్-3
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: హిట్-3
కడియం	
వెంకటసూర్య	: హిట్-3





కాటన్ బ్యారేజ్ దిగువ స్నానాలు చేస్తున్న సందర్శకులు

జర భద్రం!

- ఆనందం మాటున ప్రమాదం
- ఇసుక తిన్నెల మధ్యలో దొంగ ఊబులు
- పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న అధికారులు



ఇసుక తిన్నెలకు వెళ్లకుండా బ్యారేజ్ దిగువ మూసివేసిన మార్గం

ధవళేశ్వరం: పర్యాటకులు, స్థానికులను విశేషంగా ఆకర్షించే గోదావరి ఇసుక తిన్నెల మాటున ప్రమాదం పొంచి ఉంది. వేసవి రావడంతో గోదావరి నీటి ప్రవాహం తగ్గి బ్యారేజ్ దిగువ ఇసుక తిన్నెలు పైకి తేలాయి. సాయంత్రం సేద తీరేందుకు కాటన్ బ్యారేజ్‌కు వచ్చేవారికి ఆ ఇసుక తిన్నెలు మరింత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందజేస్తున్నాయి. దీంతో ఈ ఇసుక తిన్నెల్లో సేదతీరేందుకు పర్యాటకులు, స్థానికులు ఎక్కువ మందే వస్తున్నారు. వివరాల్లోకి వెళితే ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ దిగువన ఇసుక తిన్నెలు నీటి ప్రవాహం లేకపోవడంతో పైకి తేలాయి. బ్యారేజ్‌ను చూసేందుకు వచ్చే పర్యాటకులు, సాయంత్రం వేళ సేదతీరేందుకు వచ్చే స్థానికులు ఈ ఇసుక తిన్నెలకు ఆకర్షితులై కిందకు వెళుతున్నారు. ఇసుక తిన్నెల్లో కొంతసేపు సేదతీరుతున్నారు. అనంతరం ఇసుక తిన్నెలు మధ్యలో ఉన్న గోదావరి నీటిలో స్నానానికి దిగి మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా ఇసుక తిన్నెల మధ్యలో దొంగ ఊబులు ఉండడంతో అనేక మంది స్నానానికి దిగి ప్రాణాలను కోల్పోతున్నారు. ఇక్కడ నాచు పట్టి ఉండడంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశం ఉంది. పర్యాటకులు వీటిని గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

సిబ్బంది చెబుతున్నా..

కాటన్ బ్యారేజ్ చూసేందుకు వచ్చే పర్యాటకులు, స్థానికులు దిగువన ఉన్న దొంగ ఊబులపై జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. బ్యారేజ్ దిగువ స్నానాలకు దిగవద్దని ఇసుక తిన్నెల్లో ప్రమాదకరమైన ఊబులు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. అయితే పలువురు వీటిని ఖాతరు చేయకుండా ఒక్కొక్క సందర్భంలో ఇరిగేషన్ సిబ్బందితో సైతం వాగ్వివాదానికి దిగి కిందకు వెళుతున్నారు. ప్రతి ఏడాది ఈ ఇసుక తిన్నెల్లో అనేక మంది మృత్యువాత పడుటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే బ్యారేజ్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు.

పదేళ్లలో 50 మందికి పైనే మృత్యువాత

గడచిన పదేళ్లలో కాటన్ బ్యారేజ్ దిగువ స్నానానికి దిగి సుమారు 50 మందికి పైనే మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా వీరిలో 20 ఏళ్లలోపు యువకులే అధికంగా ఉంటున్నారు. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు బ్యారేజ్ దిగువన దొంగ ఊబులు ఉన్నాయని హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదే విధంగా తూర్పు డెల్టా లాక్ నుంచి బ్యారేజ్ దిగువకు వెళ్లే మార్గాన్ని సైతం మూసివేసి హెచ్చరిక బోర్డులను పెట్టారు. అయినప్పటికీ వీటిని పట్టించుకోని యువకులు కిందకు దిగి మత్యువాత పడుతున్నారు.

ఉపేక్షించేది లేదు



“బ్యారేజ్ దిగువకు స్నానానికి వెళ్లడం ప్రమాదకరం. దిగువ ఇసుక తిన్నెల్లో దొంగ ఊబులు ఉండటంపై హెచ్చరిక బోర్డులను సైతం ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది బ్యారేజ్‌పై సాయంత్రం వేళ గస్తీ తిరుగుతున్నారు. హద్దు మీరి బ్యారేజ్ దిగువకు స్నానానికి దిగితే ఉపేక్షించేది లేదు.”

– టి గణేష్, సీఐ, ధవళేశ్వరం

నర్సరీని సందర్శించిన సెంట్రల్ జైల్ ఎస్పీ



నర్సరీలో భారీ వృక్షాలను పరిశీలిస్తున్న జైల్ సూపరింటెండెంట్ రాహుల్ తదితరులు

కడియం: బుర్రిలంకలోని ఉమాపార్వతి నర్సరీని సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ శనివారం సందర్శించారు. భారీ వృక్షాలను సేకరించి తీసుకువచ్చి నర్సరీలో వాటిని రైతు కొత్తపల్లి మూర్తి అభివృద్ధి చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను సూపరింటెండెంట్‌కి రైతులు వివరించారు. ఆయన వెంట డీఎస్పీ రాజ్‌కుమార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

సీతానగరం: మండలంలని మునికూడలి, బొబ్బిల్లంక లలో పేకాటాడుతున్న 12 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ శనివారం తెలిపారు. మునికూడలి శివారున పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.12,510 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు. అదేవిధంగా బొబ్బిల్లంకలో పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,290 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

వైభవంగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు

- 8న గాడాల పీఠం కల్యాణ మహోత్సవం
- పోస్టర్ ఆవిష్కరించిన పీఠాధిపతి శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు స్వామిజీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు స్వామిజీ తదితరులు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలో ఉన్న మహాలక్ష్మీ సమేత చిన్నవెంకటేశ్వర స్వామివారి పీఠంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగా వేంకటేశ్వర స్వామికి కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని పీఠాధిపతి శ్రీమాన్ చిన్న వెంకన్న బాబు స్వామిజీ అన్నారు. శనివారం స్థానిక దేవీచౌక్‌లోని ఒక ప్రైవేట్ పంక్షన్ హాల్‌లో బ్రహ్మోత్సవాలకి సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులకు కల్యాణ మహోత్సవ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కనుల పండువగా జరుగుతున్నాయన్నారు. సర్వేజన సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు, మనగుడి-మనసేవ భారతీయ సేవాసమితి, అనుగ్రహ ప్రదాఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఇదేరోజు కల్యాణంలో స్వామివారు దేవేరికి నూతన సువర్ణ మాంగళ్యధారణ చేయనున్నామని, ఇది తిలకించిన కన్యలకు శ్రీఘ్రమే వివాహం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ సీనియర్ నటుడు మొల్లేటి బాలాజీ, వాసంశెట్టి గంగాధర రావు, జాతీయ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్ రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఉభయ రాష్ట్రాల వైస్ చైర్మన్ తిమ్మారెడ్డి వెంకట అప్పారావు, మధ్య శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధికి ఇచ్చేదేమిటో మోదీ ప్రకటించాలి



ఐఎన్టీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నగరానికి రెండో సారి శంకుస్థాపన చేయడానికి వచ్చిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చెవిలో పువ్వు పెట్టి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ఒక చాక్లెట్ చేతిలో పెట్టి వెళ్లిపోయారని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తాం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఇవ్వవలసిన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకి సంబంధించిన పూర్తి నిధులు విడుదల చేయడం, కడప, వైజాగ్ స్టీల్ ప్లాంట్ల గురించి ఏ విధమైన హామీలు ఇవ్వకుండానే ఢిల్లీ వెళ్లిపోయారని ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు. కాశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై ఏవిధమైన చర్యలు తీసుకోకుండా ప్రధానమంత్రి మోదీ కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు, ఏమైనా రాష్ట్రాల ఎలక్షన్లువచ్చినప్పుడే ఆ రాష్ట్రాల ప్రజలను ప్రభావితం చేసేలా తీవ్రవాదులపై మాట్లాడి ఓట్లు దండుకోవడం ప్రధానమంత్రికి బాగా అలవాటైందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జె.టి.రామారావు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులపై కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసీ విభాగం ఎప్పుడు వెన్నుదన్ను ఉండి వారి కష్టాలలో పాలుపంచుకునేటట్టు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ తడాల కొండరాజు తదిదరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

బొమ్మూరు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు సీహెచ్‌వోల ర్యాలీ



బొమ్మూరు సెంటర్ నుంచి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్ఓలు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని సీహెచ్ఓలు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (ఏపీఎంసీఏ) అసోసియేషన్ ఆధ్వర్యంలో సీహెచ్ఓలు శనివారం ఉదయం బొమ్మూరు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేశారు. ర్యాలీలో ప్లకార్డులతో సీహెచ్ఓల డిమాండ్లు నెరవేర్చాలి, పాతబకాయిలను వెంటనే చెల్లించాలి, పీఎఫ్‌ను వెంటనే పునరుద్ధరించాలని తదితర నినాదాలతో సీహెచ్ఓలు హోరెత్తించారు. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత మాట్లాడుతూ ఆరేళ్లు దాటిన సీహెచ్ఓలను క్రమబద్ధీకరించాలని నిబంధన ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇంక్రిమెంట్లు, పీఎఫ్, ఇన్సెంటివ్‌లు లేక తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో సీహెచ్ఓలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

ప్రకాశం నగర్: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అధ్యక్ష కార్యదర్శులు దుర్గభవాని, విమల, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గభవాని మాట్లాడుతూ అమ్మఒడి, ఉచిత గ్యాస్ సిలిండర్, మహిళలకు ఇళ్ల స్థలాలు వంటి హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందన్నారు. మహిళలపై అనేక దారుణాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టే విధంగా ప్రభుత్వం కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షలపైగా మహిళలు ఇళ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నారని ,ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతుందని విమర్శించారు. ప్రధాని మోదీ ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ దేశ భద్రతపై లేదని ఆమె విమర్శించారు. దేశంలో ఉన్న ముస్లిం మైనార్టీల మీద దాడులు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న అంజిబాబు

సీతానగరం: యువకులకు ప్రమాదవశాత్తూ మోటారు సైకిల్‌పై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3.15 గంటలకు వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటకు చెందిన 17 ఏళ్ల యువకులు బట్టా అంజి, టి.అరవింద్ మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లుతుండగా బొబ్బిల్లంక బ్రిడ్జ్ దగ్గరలో ప్రమాదవశాత్తూ మోటారుసైకిల్‌పై నుంచి పడిపోయారు. దీంతో అంబిబాబు కుడికాలు తొడ ఎముక విరిగి అపస్మారక స్థితికి వెళ్లాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108లో రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వేసవి విజ్ఞాన శిబిరం



శిక్షణ తరగతులలో చేసిన హ్యాండ్ క్రాఫ్ట్‌తో విద్యార్థులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుస్తక పఠనం నీతి కథలు చెప్పడం స్పోకెన్ ఇంగ్లిష్ హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం భగవద్గీత తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, అల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కడియం: మండలంలోని పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. మండల కేంద్రమైన కడియంలో రూ. 2.45 కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేసన్ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ పేపర్‌మిల్లు సహకారంతో ఏర్పాటు చేసిన పలు పరికరాలను ప్రారంభించి, ఆసుపత్రి డెవలప్‌మెంట్‌కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే కడియం సుబ్బారావు పేటలో రూ. 76.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రెల్లిపేట, సుబ్బారావుపేట, భాస్కర్‌రామ్‌నగర్‌లు నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లు, డ్రైన్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, చక్కపల్లి మురళి, పాటంశెట్టి రాంజీ, వైస్‌ఎంపీపీ పంతం గణపతి, టీడీపీ, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణాపై జనాగ్రహం

- లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు
- పాడైపోతున్న రోడ్లు
- అధికారులకు చెప్పినా ఫలితం శూన్యం



లారీలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



నిలిచిన లారీలు



లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు

రాజానగరం: మండలంలోని కలవచర్ల గ్రామస్తులు గ్రావెల్ అక్రమ రవాణాపై తిరగబడ్డారు. అడ్డూ, అదుపు లేకుండా వందల కొద్దీ లారీలలో రవాణా జరుగుతుంటే రోడ్లు పాడై, దుమ్ము, ధూళి కమ్మేస్తున్న వేళ, సహనం నశించిన జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ విధమైన అనుమతులూ లేకపోయినా, అధికారాన్ని అడ్డు పెట్టుకుని సాగిస్తున్న ఈ అక్రమ దందాపై విరుచుకుపడ్డారు. కలవచర్ల శివారు పోలవరం కాలువ గట్టున శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ తరుణంలో గత నెల రోజులుగా పోలవరం కాలువ గట్టున ఉన్న గ్రావెల్‌ని పొక్లెయిన్‌తో తోడేసి, లారీల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. అధికార పార్టీ పెద్దల పేరుతో జరుగుతున్న ఈ దందాపై కలవచర్ల గ్రామస్తులు కొందరు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయింది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం ఈ రోడ్డుపై వందలాది లారీలలో గ్రావెల్ మట్టిని తరలిపోతున్నారు. ఇదే విషయాన్ని ‘యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు’ శీర్షికన సాక్షిలో గత నెల 27న కథనం వచ్చిన సంగతి విదితమే. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. అక్రమ రవాణా ఆగలేదు. దీనితో విసిగిపోయిన జనం శనివారం రాత్రి ఇళ్ల నుంచి బయటకు వచ్చి, గ్రావెల్ తరలించుకుపోతున్న లారీలకు అడ్డుగా నిలిచారు. మీ అక్రమ దందాతో రోడ్లు పాడై, దుమ్ము ధూళితో మా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, దయచేసి పర్యావరణాన్ని కలుషితం చేయవద్దని వేడుకున్నారు. హెల్మెట్ పెట్టుకున్నా ధూళితో దారి కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. దోచుకోవడమే ధ్యేయంగా ఉన్న గ్రావెల్ చోరులకు జనం గోడు వినిపిస్తుందా? వారి రోదన అరణ్య రోధనగానే మిగిలిపోతుంది. జనాగ్రహంతో గ్రావిల్ మట్టి తవ్వకం పనులు తాత్కాలికంగా ఆపినా గానీ, జనం వెళ్లిన తరువాత దందాను కొనసాగించడం కొసమెరుపు.